# "అయామ్ సారీ మూర్తి గారూ"

"మీరేం తీసుకుంటారు?"

"పిస్తా ఐస్‌క్రీం, వీలయినంత పెద్ద కప్పు."

"టూ పిస్తా ఐస్‌క్రీం ప్లీజ్ ..... ఐస్‌క్రీం మీ కిష్ట ం అనుకుంటాను."

"చాలా. అంటే ఈ మధ్యనే అలవాటయింది."

"అమ్మాయిలు లావెక్కుతారని భయపడతారు కదా?... మీరేం లావులేరనుకోండి."

"నాకా భయం లేదు. నాకు క్రితం నెల ముప్ఫై ఏళ్లు దాటేయి. ఒకరకంగా అమ్మాయిని కాదు. లా వెక్కడం నాకూ ఇష్టం ఉండదు. నా కారణం వేరనుకోండి."

"థేంక్స్. తీసుకోండి... మీ కారణం అంటున్నారు?"

"వెరీ నైస్. ఆ...పెళ్లి కాని అమ్మాయిలు లావెక్కితే పెళ్లికాదని జాగర్తపడతారు. నాకా బాధ లేదు. నేను ఆరోగ్య కారణాల వల్ల లావెక్కడానికి ఇష్టపడను. నా జాగర్తలో నే నుంటాను."

"ఆమధ్య పదిహేను రోజులు లండన్‌లో ఉన్నాను. అంటే ఫైనల్‌గా యూఎస్ వదిలి ఇక్కడికి రావడానికి ముందు. మన వయసువాళ్లందరూ లావెక్కి పొట్టలు పెంచేరు. యూఎస్‌లో కూడా పొట్టల సమస్య ఎక్కువయిపోయింది."

"విన్నాను. అది జంక్‌పుడ్ తినడం కూల్‌డ్రింక్స్ తాగడంవల్ల అనుకుంటాను. ఇక్కడ కూడా అటువంటి చెత్తచెదారం తినడం ఫేషనయిపోయింది. మిరపకాయబజ్జీలు, పానీపూరీ నయం."

"..... మీ బాయ్‌ఫ్రెండ్స్‌తో ఎప్పుడూ అటువంటి జాయింట్స్‌కి వెళ్లరా?"

"వెళ్తుంటాను. తినను. బాయ్‌ఫ్రెండ్స్ అంటే వాళ్లు నా కొలీగ్స్. ఐ లైక్ మెనీ ఆఫ్ దెమ్."

"ఐసీ... ఊ... మీ రేవీ అనుకోరుగదా? ఈ అయిదారేళ్లలో మీరు చాలా

మారిపోయారు. మీరు....''

''రైట్. అప్పుడు నాకు పాతికేళ్లు. హైదరాబాద్ మేం వచ్చి అప్పటికి రెండేళ్లయింది. నేను ఉద్యోగంలో చేరి ఆరేళ్లయింది. మార్పు రాకుండా ఉంటుందా?.... మీరూ కొంత మారినట్టున్నారు.''

'' ... ఆ..ఆ.. మీ ఉద్యోగం ఎలా ఉంది? బాగా కాలక్షేపం అవుతుందేమో గదా?''

''చాలా ఇష్టపడి ఉద్యోగం చేస్తున్నాను. మంచి సేలరీ. మనం మొదట మీటయినప్పుడు ఎం.బి.యే. చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాను. ప్రస్తుతం కాలక్షేపం కోసం చెయ్యడం లేదు.''

''ఐనో. జీతం బాగుంటుందంటున్నారు గదా.''

''కానీ దాని గురించి కాదు. ఈ ఉద్యోగంలో చేరిన కొత్తరోజుల్లో నా గురించి నాకేవీ తెలీదు. చదువుకున్నాను. మా పేరెంట్స్ చాలా మంచివాళ్లు. ఒచ్చిన కొత్తల్లో నా ఫ్రెండ్స్ కొంతమంది ఆఫీసులకి వెళ్లేను. తేడా అప్పుడు అర్థమైంది. ఉద్యోగంలో చేరిన తరవాతగానీ నా కేపబిలిటీ, ఓ సిట్యుయేషన్‌ని అర్థంచేసుకుని నిలబడగల ధైర్యం, ముఖ్యంగా నే నంటే ఏవిటో నాకు తెలిసింది.''

''మీ మార్పు తెలుస్తోంది. యూ ఆర్ ఎ డిఫెరెంట్ పెర్సన్. మరి... ఎడ్జస్ట్‌మెంట్ సమస్యలుండవంటారా?''

''ఆరేళ్లక్రితం పెళ్లయిపోయి ఉంటే మామూలుగా ఇల్లూ, పిల్లలూ, బహుశా అవసరం అయితే ఉద్యోగం... అంతా మామూ లుగా ఉండేది. ఇప్పుడు తలుచుకుంటే.... ఏదో ప్రమాదంలోంచి బయటపడ్డా ననిపిస్తూంటుంది. మన గురించి మనం తెలుసు కోవడంవల్ల కొన్ని ఇబ్బందులు కూడా ఉంటాయి. మీ రేవనుకుంటారు?''

''నిజం చెప్పాలంటే నే నెప్పుడూ అట్లా ఆలోచించలేదు. కాలేజీలో చదువుతు తప్ప ఏవీ ఉండేది కాదు. మాకు న్యూస్ పేపర్లు కూడా ఉండేవి కాదు. తరవాత ఇక్కడే ఉద్యోగం. అనుకోకుండా కాలిఫోర్నియా ఆఫర్ వచ్చింది. వెళ్లిపోయాను. చాలా బావుండేది అక్కడ. ఉద్యోగం, జీతం రెండూ. గాలిపటంలా కింద పడ్డాం. కల్లో కూడా ఊహించలేదు. మరో పది సంవత్సరాలు పని చేసి ఇండియా వచ్చి సెటిలవుదామనుకున్నాను. కానీ...''

''మీ రేవీ అనుకోనంటే...''

''ఏవీ అనుకోకుండా ఉండడానికే ఇక్కడికి వచ్చేం. చెప్పండి.''

''అక్కడ.. అంటే, మీ క్వాలిఫికేషన్స్‌కి తగ్గట్టుగా మేరేజ్ చేసుకోలేదేం.''

''ఇటీజ్ ఎ నేచురల్ క్వశ్చన్... రెండు మూడేళ్లు డబ్బు సంపాదనలో మరో ఆలోచన

ఉండేది కాదు. మా వాళ్లు చూసిన ఒకటి రెండు సంబంధాలు నాకు నచ్చలేదు... పోతే, అమెరికాలో కూడా..."

"అంటే మీకు నచ్చలేదా?"

"అసలంత వరకూ రాలేదు."

"ఇప్పుడేం చేద్దామనుకుంటున్నారు. ఏదేనా..."

"మొదట రెండు నెలలు డిప్రెషన్‌లో ఉండేవాణ్ని. మా మదరు నా గురించి బెంగపెట్టుకుంది. అనుకోకుండా ఇంగ్లండ్ నుంచి నా ఫ్రెండ్స్ ఇద్దరు ఉద్యోగాలు పోయి నాలాగే హైదరాబాదు వచ్చేరు. ముగ్గురం కలిసి ఏదేనా చెయ్యాలని ప్లాన్ చేస్తున్నాం. ఇంక ఇంట్లో గొడవ మొదలైంది."

"గొడవ అంటే?... ఓ. అర్థమైంది. మన దేశంలో పెళ్లిళ్లన్నీ ఇష్టానిష్టాల కోసం కాకుండా అవసరాల కోసం జరుగుతాయి. ముఖ్యంగా నలుగురూ ఏ వనుకుంటారోననే స్టుపిడ్‌ఫియర్."

"మరి మీ పేరెంట్స్...."

"సంబంధాలు చూస్తున్నారు. కురదడం లేదు. మా అమ్మగారు బాగా సెంటిమెంటల్. జాతకం చూపిస్తూంటుంది. ఇప్పుడు నాకు పెళ్లి ఆలస్యం అయితే ఒచ్చే ప్రమాదం ఏవిటో నాకు అర్థం కావడం లేదు. నాకు నవ్వొస్తుంది. ఏ వయసులో జరగవలసినవి ఆ వయసులో జరిగితే అచ్చటాముచ్చటా అంది మా పిన్ని."

"అవును. మా అమ్మ కూడా అంటూంటుంది."

"సిల్లీ. అచ్చటా ముచ్చటా ఎవరికిట? చూసేవాళ్లకి. చేసుకునేవాళ్లకి కాదు. చూసేవాళ్ల సరదాకోసం నే నెందుకు చేసుకుంటాను పిన్నీ అన్నాను. మన ఆలోచన అవసరం లేదా?... ఏవిటి నవ్వుతున్నారు?"

"ఏవీ లేదు. మీరు చాలా రాడికల్‌గా ఆలోచిస్తున్నారు."

"లేదు. లాజికల్‌గా మాట్లాడుతున్నాను. మనం ఇతరుల కోసం బతుకుతున్నాం. మన కోసం కాదు. అందరూ ఏం చేస్తే అదే చేస్తాం. మీరు ఒప్పుకుంటారా? విచిత్రం ఏమంటే, మనం ఫోటోలు పెట్టి దండలువేసి దణ్ణాలుపెట్టే గొప్ప స్త్రీలూ, పురుషులూ నలుగురూ చేసినట్టుగానీ, ఆలోచించినట్టుగానీ చెయ్యలేదు. మీకు బోరు కొడుతున్నట్టుంది. పోన్లెండి ఇంకేవేనా మాట్లాడండి."

"వ్యక్తిత్వం అంటే ఇతరులతో సద్దుకుపోవడం చాతకాదని అర్థం కాదు. ఇంతవరకూ సద్దుకుపోవడం ఆడవాళ్లే చేశారు. ఇప్పుడు మీరు కూడా చెయ్యాలి."

"అక్కడ ఆడవాళ్ల హక్కుల గురించి చాలా గొడవ జరుగుతోంది."

"ఇది కేవలం హక్కులకి సంబంధించింది కాదు. మన పెద్దలకి తెలిసిన జీవితం

కాదిది. వాళ్లు చేసిన ఉద్యోగాలు కావు. వాళ్లకి తెలిసిన ఒత్తిడి కాదు. ఇది మనకే తెలుస్తుంది. అందుచేత మనకి ఏం కావాలో ముందు మనకి తెలియాలి. బాగా తెలివైన ఉద్యోగిని అంత మంచి గృహిణి కాకపోవచ్చు. భర్తకి ఉద్యోగినిగా నచ్చి భార్యగా నచ్చకపోతే తప్పెవరిది?"

మీరింత బాగా మాట్లాడతారని అప్పుడు తెలీదు నాకు."

"నాకూ తెలీదు లెండి. నాకిది జీవితం నేర్పింది... ఏం ఒద్దు. చిప్స్ తీసుకురా. థేంక్స్"

"... ఆ .. మీకు మగవాళ్లంటే కోపం అనుకుంటాను."

"వెరీ రాంగ్. మగవాళ్లు అందరూ చెడ్డవాళ్లనీ ఆడవాళ్లందరూ మంచివాళ్లనీ ఏ ప్రూఫూ అండం లేదు. మన జనరేషన్ మగా ఆడా కూడా ఒక రకమైన విక్టిమ్స్. ఛాయిస్ లేకుండా పోతోంది. మారుతోన్న లైఫ్ స్టయిల్‌లో ఇద్దరికీ ఛాయిస్ తక్కువ. అది మనం గుర్తించాలి. మార్పుని హేండిల్ చెయ్యడం మనకి చాతకావడం లేదు. కొట్టుకుపోతున్నాం. ఈ సిట్యుయేషన్ మన పెద్దలకి అర్థం కాదు. మనకి సహకారం, సహాయం కావాలి. ఉపన్యాసాలు కాదు. అమెరికాలో మీలాంటి వాళ్లకి ఉద్యోగాలు పోవడం ఎంతమంచిదో మీకు అర్థం కావడం లేదు."

"ఉద్యోగాలు పోవడం మంచిదా? బలేవారే మీరు."

"అవును. మీ రనుకున్న సెన్సులో కాదు. ఆలోచిస్తే మీకే అర్థం అవుతుంది. ఓ రకంగా మీరే దానికి ఉదాహరణ."

"నా కర్థం కావడం లేదు."

"మీకు కోపం వచ్చినట్టుంది. అయాంసారీ. ఇంకేదేనా మాట్లాడండి. చిప్స్ బావున్నాయి."

"మీరు బాగా పుస్తకాలు చదువుతారా?"

'చాలా తక్కువ. ఆ మధ్య మా బాబాయి చలంగారి పుస్తకాలు చదువుతున్నావా అన్నాడు."

"చదివేరా? చలం ఎవరు?"

నాకూ సరిగ్గా తెలీదు. మా తమ్ముడు చెప్పేడు గుడిపాటి వెంకటచలం స్త్రీల గురించి గొప్పగా రాసేవాట్ట. మా తమ్ముడూ నేను ఎక్కువ మాట్లాడుకుంటాం."

"గుడ్... మీతో ఇంత బాగా టైం గడుస్తుందనుకోలేదు. పది నిముషాలనుకున్నాను. వెరీ నైస్ ఈవెనింగ్."

"మీరు కూడా మాట్లాడితే ఇంకా బావుండేది. మీ అనుభవం ఎక్కువ కదా."

"మీలాగ ఆలోచిస్తే అనుభవం ఉండేదేమో. విదేశాల్లో ఉన్నంతమాత్రాన నిజమైన అనుభవం రాదు. ఓకే.... ఇంతకీ... మీ అభిప్రాయం చెప్పలేదు."

"మీరేవీ అనుకోనంటే మాటడగనా?"

"అడగండి. మనం మాట్లాడుకోవడం మంచిదనేగా ఇట్లావచ్చేం. మీ ఫాదర్ వెయిట్ చేస్తున్నారనుకుంటాను."

"ఆరేళ్ల క్రితం మీకు నచ్చనిదాన్ని, మళ్లీ మీరు వెతుక్కుంటూ వచ్చేరు.... అప్పుడు నేను ఇంజనీర్ని కాదని ఒద్దనుకున్నారు గదా. ఇప్పుడూ ఇంజనీర్ని కాదు."

"అంటే మీరు నచ్చలేదని కాదు... అప్పట్లో ఒకే ప్రొఫెషన్ అయితే బావుంటుందనిపించింది. ఇప్పుడింక సిట్యుయేషన్ ఈజ్ డిఫరెంట్."

"ఓపెన్‌గా చెప్పాలంటే ఇప్పుడెవరైనా ఒకటే. మీ అవసరం మారింది. మీరు నన్ను చూడ్డానికి వచ్చినప్పుడు తప్పకుండా ఒప్పుకుంటారనుకున్నాను... నిజం చెప్పాలంటే కొంచెం ఫీలయ్యేను. కానీ మీకు థాంక్స్ చెప్పాలి."

"అయాం సారీ. బట్... పోన్లెండి. అయిపోయిందిగా. మీరీ ఆరేళ్లలో ఇల్లు మారి ఉంటే కష్టం అయి ఉండేది. ఓకే..... మీ అభిప్రాయం చెప్పండి. మా అమ్మ వెయ్యిదేవుళ్లకి మొక్కుకుని ఉంటుంది."

".... మీమీద నాకేం కోపం లేదు. నన్ను అపార్థం చేసుకోకండి దయచేసి. చెప్పేనుగా మీరు నాకు ఒక రకంగా ఉపకారం చేశారు..... కానీ. .. సారీ మూర్తిగారూ...."